


**రచనాకాలం: 2000 సంవత్సరం**

*(గత సంచిక తరువాయి)*

## 11

గోపీనాథ్, సునీత పనిచేసే క్వాంటమ్ ఇన్ కార్పోరేషన్ నించి మరో ఫేక్స్, తర్వాత హీరాలాల్ కెమికల్స్ కంపెనీ పేర లెటర్ అందాయి.

అవి రెండు తన చేతిలో పడగానే చెప్పాడు గోపీనాథ్ విరించితో.

"అమెరికన్ కన్సలేట్‌కి వచ్చే బుధవారం వీసాకోసం నువ్వు వెళ్ళాలి. జాగ్రత్తగా విను. హీరాలాల్ కెమికల్స్ కంపెనీలో పనిచేస్తున్నావు నీవు. అమెరికానుంచి కొన్ని ముడిపదార్థాలు మీ కంపెనీ అవసరాల కోసం దిగుమతి చేసుకోడానికి చర్చలకి వెళుతున్నావు. ఇండియాలో నిజంగా హీరాలాల్ కెమికల్స్ అనే కంపెనీ లేదుకానీ, అమెరికాలో వుంది. అందులో నా ఫ్రెండ్ సునీత పనిచేస్తోంది. నేనామెకో గొప్పసాయం చేశానోసారి. బదులుగా ఈ హెల్ప్ చేసింది. వాళ్ళ కంపెనీ లెటర్ హెడ్‌మీద నిన్నే చర్చలకి అమెరికా పిలుస్తున్నట్లు రాసి పోస్ట్ ద్వారా రెండు లెటర్స్, ఇంక వాళ్ళ ఫేక్స్ ఫోన్ నించి రెండు ఫేక్స్‌లు పంపింది. ఈ ఉత్తరాలు ఫేక్స్‌లో చదువు. ఓ తేదీ ఫిక్స్ చేసి ఆ రోజుక్ మీటింగ్‌కి రమ్మని వాళ్ళు ఫేక్స్ ఇచ్చి లెటర్ రాసారు. అయితే నీకు ఆ రోజుకి కుదరలేదు. కాబట్టి మరోరోజు సూచించావు. వాళ్ళు దానికి వప్పుకుని లెటర్ రాశారు."

"మొదటిసారి నాకు ఎందుకు కుదరలేదు?" అడిగాడు విరించి ఇచ్చిన ఆ కాగితాలను చదివి.

"నీకేదో పర్సనల్ ప్రాబ్లమ్ అడ్డువచ్చింది. నీ పేరెంట్స్ మేరేజ్ ఏనివర్సరీ అయ్యాక వెళ్ళాలనుకున్నావు. ఓసారి అమెరికాకి వెళ్ళడానికి అవకాశం వచ్చీ దాన్ని నువ్వు వుపయోగించుకోలేదని నిన్ను వీసాకోసం ఇంటర్వ్యూ చేసే కన్సలేట్ ఆఫీసర్‌కి తెలిస్తే నీకు వీసా ఇవ్వడానికి ఎక్కువ అనుకూలంగా వుంటుంది. నీకు ఈ ట్రిప్ పెద్ద ఆకర్షణీయమైందికాదు అన్న సైకలాజికల్ ఇంప్రెషన్ కలుగుతుంది వాళ్ళకి. అలాంటి వాళ్ళకే వీసా ఇస్తారు. ఎలాగైనా అమెరికా వెళ్ళాలన్న కుతూహలం ప్రదర్శించే వాళ్ళ విషయంలో వాళ్ళు అన్నీ జాగ్రత్తగా చూస్తారు."

"తేడా ఏమిటి?" అడిగాడు విరించి.

"ఆసక్తి లేకుండా వెళ్ళేవాళ్ళు ఖచ్చితంగా తిరిగివస్తారు అని. వెళ్ళాలని కుతూహలపడేవాళ్ళు తిరిగి రాక అక్కడే సెటిల్ అవుతారని వాళ్ళు కొలబద్దగా తీసుకుంటారు."

"అందుకనేనా ఇలా ప్లాన్ చేశావు?"

"అవును"

"ఈ మోసాన్ని పసిగట్టలేరా?" అడిగాడు విరించి.

"ఇట్నుంచి వెళ్ళే ఉత్తరాలు ఇండియన్ కంపెనీలు వాడే ఇంగ్లీషులో వెళ్ళాయి. అట్నుంచి వచ్చినవి వాళ్ళ లెటర్ హెడ్‌లో వాళ్ళు వాడే ఇంగ్లీష్‌లో వచ్చాయి కాబట్టి అనుమానం వచ్చే ఆస్కారం లేదు. ఇలాంటివి కన్సలేటులో జాగ్రత్తగా చూస్తారు. ఫేక్స్ కూడా క్వాంటమ్ ఇన్ కార్పోరేషన్ వాళ్ళు ఫోన్ నించి పంపించేందుకు ఫేక్స్ మెసేజ్‌లో ఏ ఫోన్ నించి పంపుతామో ఆ నంబరు కూడా వస్తుంది. వాళ్ళ కంపెనీ లెటర్ హెడ్‌నే ఉపయోగించింది. అవి టై చేసి పంపిన సునీత. కాబట్టీ నిజంగా ఆ కంపెనీ నించే ఆ ఫేక్స్, ఆ లెటర్ వచ్చాయి అని నమ్ముతారు."

"సునీత మనకి ఈ విషయంలో సహాయం చేయడం నా అదృష్టం" చెప్పాడు విరించి.

"కాదు. సునీత ఆ కంపెనీలో పనిచేయడం, అన్నిటికీ మించి పర్చేజ్ సెక్షన్‌లో పనిచేయడం మన అదృష్టం. ఇంకో విభాగంలో పనిచేస్తే ఆమెకి ఇవి పంపేందుకు ఏక్సెస్ దొరికేదికాదు."

"నే వెళ్ళేది ఏ వీసా మీద?"

"బిజినెస్ వీసా, పర్చేజ్ ఆఫీసర్‌గా పనిచేసే హీరాలాల్ కెమికల్స్ నిన్ను తన ఖర్చుతో పంపిస్తోంది."

"వచ్చేవారం దాకా దేనికి ఆగడం? వెంటనే వీసా కోసం వెళ్ళొచ్చుగా?" అడిగాడు విరించి.

"కన్సలేట్‌లో నువ్వు పనిచేసే కంపెనీ ప్రాడక్ట్స్ మీద, వాటికి ఉపయోగించే రా మెటీరియల్స్ మీద ప్రశ్నలు వేస్తారు నిన్ను. వాటికి నువ్వు చురుగ్గా జవాబులివ్వకపోతే అనుమానం వస్తుంది. నీకు మూడు నాలుగురోజులు ఆ వివరాలమీద ట్రైనింగ్ ఇవ్వాలి."

ఓ ప్రాడక్షన్ మేన్యువల్ ఇచ్చి చెప్పాడు.

"ఇందులో కొన్ని మందుల తయారీకి సంబంధించిన వివరాలున్నాయి. దీన్ని జాగ్రత్తగా చదువు. బేసిక్ నాలెడ్జి ఏర్పడుతుంది. ఏ రా మెటీరియల్స్ కొనడానికి వెళుతున్నావో తేలిగ్గా చెప్పగలవు."

"అలాగే"

"ఇది ఓ కెమికల్ కంపెనీనించి అరువు తెచ్చాను. అందులో పని చేసే కెమికల్ ఇంజనీర్ మంగళవారం వచ్చి నిన్ను కలుస్తాడు. నిన్ను రకరకాల ప్రశ్నలు వేస్తాడు. నువ్వు అతనికి తృప్తిగా జవాబులివ్వగలిగితే కన్సలేట్ వాళ్ళు కూడా ఆ ప్రశ్నలడిగితే తృప్తికరంగా జవాబులివ్వగలవు."

"కన్సలేట్‌లో టెక్నికల్ వాళ్ళుంటారా?" అడిగాడు విరించి.

"ఖచ్చితంగా వుంటారు. ముఖ్యంగా కన్సలేట్ ఆఫీసర్లందరూ బాడీ లాంగ్వేజ్‌లో శిక్షణ పొందినవారు. నోటితో చెప్పే జవాబులకన్నా అది రైటా, రాంగా అనేది బాడీ లాంగ్వేజ్ ద్వారా నిర్ణయిస్తారు. అబద్ధం చెప్తున్నా నిజమనుకుని తడబడకుండా చెప్పాలి నువ్వు."

"అర్థమైంది."

"నీకు వీసా మంజూరు కాదన్న అపనమ్మకం నాకేమాత్రం లేదు. వీసా తీసుకోడానికి అన్ని వీక్ పాయింట్స్ కవర్ చేస్తున్నాను" చెప్పాడు గోపీనాథ్.

ఆ లెటర్‌ని చదివి క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాక అడిగాడు గోపీనాథ్ తమ్ముడ్ని.

"ఎనీ డౌట్స్?"

"సునీత ఎవరు? ఆమెకి నువ్వు చేసిన గొప్ప సహాయం ఏమిటి?" ప్రశ్నించాడు విరించి.

"నేను యూనివర్శిటీలో చదువుతుండగా సునీత నాకు పరిచయం. నా క్లాస్‌మేట్ అక్కయ్య.

నేను మొదటిసారి అమెరికాకి వెళ్తున్నాను కాబట్టి నా క్లాస్ మేట్ ఆమెకి ఫోన్ చేసి చెప్పాడు.

నేనున్న బర్కిలీ ఏరియాలోనే ఆమె వుండేది. సునీత, వాళ్ళాయన శాన్‌ఫ్రాన్సిస్కో ఏర్‌పోర్ట్‌కి వచ్చి నన్ను రిసీవ్ చేసుకున్నారు. వాళ్ళు ముందే చూసిన ఫ్లాట్‌లో నన్ను దింపారు. అందులో అప్పటికే ముగ్గురు స్టూడెంట్లున్నారు. వాళ్ళతో అద్దె షేర్ చేసుకుంటూ వున్నాను."

"ఆమెకి ఏం సహాయం చేశావు?"

"ఎయిటీ సిక్స్‌లో గ్రీన్‌కార్డ్ హోల్డరైన శ్రీరామ్‌కిచ్చి సునీతకి పెళ్ళి చేసారు. అయితే ఆమెని అమెరికాకి తీసుకొచ్చే వుద్దేశం లేదు శ్రీరాంకి. ఆమెకో కొడుకుపుట్టినా, ఆమెని తీసుకెళ్ళడానికి పేపర్లు సబ్మిట్ చేయలేదు. దాంతో నైన్టీ త్రీలో సునీత తన కొడుకుతో భర్త ప్రమేయం లేకుండా టూరిస్ట్ వీసాతో అమెరికా వచ్చింది. ఆమె తండ్రి దగ్గరనుండి సునీత స్టే లీగల్ అయ్యేలా, శ్రీరాంతో అప్రూవ్డ్ వీసా పిటిషన్‌ని ఫైల్ చేయించాడు. "

"అంటే?"

"అంటే, కేవలం ఆర్నెల్లు అమెరికా చూడటానికి మాత్రమే వచ్చిన సునీత తన భార్య అని, ఆమెని తనతో కలిసి శాశ్వతంగా అమెరికాలో వుండనివ్వమని అన్నమాట. అయితే ఆమెకి ఆ వీసా రావడానికి చాలాకాలం పడుతుంది. వాళ్ళిద్దరికీ పెద్దగా పడేదికాదు."

"దాంతో ఇంకో సంతానం కలగలేదా?" నవ్వుతూ అడిగింది మాలతి.

గోపీనాథ్ కూడా నవ్వాడు.

"దానికీ, దీనికి ఏమిటి సంబంధం? ఇంకో కొడుకు పుట్టాడు. సునీతని కొట్టేవాడు. విడిపోయి ఉద్యోగం చేసుకుని బ్రతుకుదామంటే, వర్క్ పర్మిట్ లేదు. ఆ మాటకొస్తే, కారు డ్రైవింగ్ లైసెన్స్ సోషల్ సెక్యూరిటీ లేక అమెరికా వదిలి పుట్టింటికి వచ్చేస్తే తిరిగి అమెరికాలో కాలు పెట్టలేదు. మళ్ళీ వీసా ఇవ్వరు. అంచేత భర్త పెట్టే బాధలు భరిస్తూ వుండేది. సరిగ్గా ఆ టైంలో వెళ్ళాను నేను అమెరికా."

"ఏం హెల్ప్ చేశావు నువ్వు?"

"ఆమెని ఓ రోజు చితక్కొట్టాడు. దాంతో శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలోని బేటర్డ్ హోమ్ షెల్టర్‌కి పిల్లలతో సహా మారింది. ఇలాంటి భార్యలని వుంచుకునే శరణాలయం లాంటివి అమెరికా అంతటా వుంటాయి. దానికే తను నామోషీగా ఫీలయ్యాడు. ఆమె తనతో వుండటానికి పెట్టుకున్న అప్లికేషన్‌ని విత్ డ్రా చేస్తానని బెదిరించాడు.

అదే జరిగితే ఆమెని, పిల్లల్ని ఇండియాకి డిపోర్ట్ చేస్తారు. ఇంటికి రమ్మని పిల్చినా తిరిగి ఆమె అతని దగ్గరికి వెళ్ళి బాధలు పడదల్చుకోలేదు. దాంతో అతను ఆమెమీద విడాకులకి కేసు వేశాడు. అంతేకాదు ఐ.ఎన్.ఎస్ వాళ్ళకి అంటే విదేశస్థులని టైంబార్ దాటాక చేసిన రెలిటివ్స్ పిటిషన్‌ని విత్ డ్రా చేస్తున్నట్లు కూడా రాశాడు. తన భార్యా, పిల్లలు ఇండియాకి డిపోర్ట్ చేయబడటం అతని ధ్యేయం అయింది."

"ఆమెకి అక్కడ ఇంకెవరూ తెలిసినవాళ్ళు లేరా?" అడిగింది మాలతి.

"ఒక్క ఫ్రెండ్, ఒక్క బంధువు కూడా అమెరికాలో లేరు. ఈ పరిస్థితుల్లో ఆమెకి ఇమిగ్రేషన్ స్టేటస్ అంటే శాశ్వతంగా అమెరికాలో వుండే అవకాశం లేకపోగా అమెరికానించి వెళ్ళగొట్టబడే పాయింట్‌కి దగ్గరవసాగింది."

"ఇలాంటి వాళ్ళు చాలామందే వుంటారా అక్కడ?"

"బొచ్చెడుమంది. సరిగ్గా ఈ టైంలో బిల్ క్లింటన్ ఏంటీ క్రైంబిల్‌ని పాస్ చేశాడు. ఎన్నో ముఖ్యమైన ఇమిగ్రేషన్ ప్రొసీజర్స్‌తోపాటు సునీత వున్న స్థితిలో వుండేవారు డిపోర్టేషన్‌ని సస్పెండ్ చేయమని కోరుతూ ఇమిగ్రేషన్‌ని అప్లయ్ చేసే ప్రొవిషన్ దాన్లో

వుంది. మర్నాడు డిపోర్ట్ అవుతుందనగా ఈరోజు రాత్రి దాన్ని కోర్టు రద్దు చేసింది. తను తన పిల్లలు అమెరికాలో వుండే పిటీషన్‌ని తన భర్త అబ్యూస్ చేసారని తనకి, తన పిల్లలకి గ్రీన్‌కార్డ్‌ని గ్రాంట్ చేయమని పిటీషన్ పెట్టుకుంది. ఆ సమయంలో ఆమెకి ఎలాంటి సహాయం చేసేవారు అమెరికాలో లేరు. నాకా విషయాన్ని చెప్పి ఏడ్చింది. నేనామెని ఆర్థికంగా, మోరల్‌గా ఆదుకున్నాను. ఆమెకి అటార్నీ ఫీజ్ కోసం నేను సంపాదించి సేవ్ చేసిందంతా ఇచ్చేశాను. ముఖ్యంగా కావాల్సిన రుజువు ఆమెని భర్త కొట్టేవాడని, పిల్లలు ఊహ తెలిసినవాళ్ళు కారు. ఈ పాయింట్‌లో నేనామెకి సహాయం చేశాను."

"కోర్టులో ఆమె భర్తకి వ్యతిరేకంగా ఎవిడెన్స్ ఇచ్చావా?"

"అవును. నిజానికి ఆమెని అతను కొట్టడం నేనెన్నడూ చూడలేదు. అయితే చూసానని చెప్పాను. నా సాక్ష్యం ఆ కేసులో బాగా పనిచేసింది. ఆమెకి గ్రీన్ కార్డ్ వచ్చింది."

"మళ్ళీ పెళ్ళి చేసుకుందా?"

"ఆ. ఏడాదిన్నరకి సునీత ఓ పంజాబీని ఇష్టపడి అతన్ని చేసుకోవాలనుకుంది. అతను ఇల్లీగల్. ఈలోగా అమెరికన్ సిటిజన్‌షిప్ తీసుకుంది సునీత. దాంతో అతన్ని చేసుకుని అతని స్టేని లీగలైజ్ చేసింది. ఆ పంజాబీ అతన్ని కూడా నేనే సునీతకి పరిచయం చేసింది. అయితే సునీత కన్నా నాలుగేళ్ళు చిన్నవాడయిన అతన్ని నేనా ఉద్దేశంతో పరిచయం చేయలేదు. నేను సునీతకి చేసిన హెల్ప్‌కి ఆమె ఎంతో గ్రాటిట్యూడ్‌గా వుంటుంది."

విరించి అమెరికన్ కన్సలేట్‌కి తీసుకెళ్ళాల్సిన బిజినెస్ వీసా డాక్యుమెంట్లన్నింటిని ఫైల్‌లో గోపీనాథ్ ఓ క్రమంలో వుంచాడు. ఆ ప్లాస్టిక్ ఫోల్డర్‌లోని డాక్యుమెంట్స్‌ని తమ్ముడికి చూపించి వివరించాడు.

"కన్సలేట్ ఆఫీసర్ ఏదడిగినా నోటితో జవాబు చెప్తూ, అందుకు సంబంధించిన డాక్యుమెంట్‌ని కూడా అడక్కపోయినా చూపించు. వాళ్ళు మాటలకన్నా కాగితాలని ఎక్కువగా నమ్మే మనుషులు. అర్థమైందా?"

"అలాగే అన్నాయ్."

"ఏ ప్రశ్నకీ తత్తరపడకుండా జవాబివ్వు. సమాధానం తెలీకపోతే అబద్ధం ఆడకు, తెలీదని చెప్పు. అమెరికన్స్ నిజాయితీని ఇష్టపడతారు."

"అలాగే."

"వీసా ఇవ్వకపోతే నీ మొహంలో ఎలాంటి గాభరా చూపించద్దు. అది మోస్ట్ ఇంపార్టెంట్. అయినా నీకు వీసా రిజెక్ట్ చేయడానికి ఎలాంటి కారణం వాళ్ళకి లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాను."

గోపీనాథ్‌ని అతని తల్లి అడిగింది.

"ఇంత ప్రిపరేషన్, ఇంత అవస్థపడితే ఇండియాలోనే వీడికి మంచి ఉద్యోగం ఇప్పించి వుండేవాడిగా, అమెరికాకే పంపాలని ఎందుకంత పట్టుదల?"

"వాడు అక్కడికి చేరి, పొలిటికల్ అసైలమ్ తీసుకుని ఆ దేశపౌరుడు అయ్యాక నన్ను మెడపట్టి బయటికి గెంటిన ఆ ఐ.ఎన్.ఎస్ వాళ్ళ మీద వ్యక్తిగతంగా నేను కసి తీర్చుకున్నట్లు. వాళ్ళనెలా చిత్తుచేశానో ఆ తర్వాత వాళ్ళకి చెప్తాను. బట్, ఇంక వాళ్ళేం చేయలేరు, అవమానాన్ని దిగమింగుకోవడం తప్ప."

"ఇందుకు యింతదాకా ఎంత ఖర్చు అయిందింతకీ?" అడిగాడు గోపీనాథ్ తండ్రి.

"లెక్క రాస్తున్నాను. అమెరికాలో విరించి సెటిల్ అయిన తర్వాత నాలుగైదు నెలల్లో దీన్ని తీర్చేయగలడు" చెప్పాడు గోపీనాథ్ నవ్వి.

గోపీనాథ్ చెప్పినట్టుగానే విరించి మద్రాసులో ఉదయం ఆరున్నరకల్లా జెమిని సర్కిల్ దగ్గరున్న అమెరికన్ కన్సలేట్కి చేరుకున్నాడు. క్రమంగా ఆ క్యూలో అతని వెనక రెండువందల మందిదాకా చేరారు. ఉదయం ఎనిమిదన్నరకి లోపలి వెళ్ళడానికి గేటు తీసేలోగా మొట్టమొదటగా లోపలికి వెళ్ళిన యాభైమందిలో విరించి వున్నాడు.

అతను ఫిలప్ చేసిన వీసా అప్లికేషన్ ఫారం మొదలైనవి పరిశీలించాక లోపలికి అనుమతించారు విరించిని. ఆఖరిసారిగా తనతో తెచ్చిన ఫైల్‌ని తిరగేసి కాగితాలని చూసుకున్నాడు విరించి. అతను చెప్పబోయే కట్టుకథకి సపోర్ట్ చేసే డాక్యుమెంట్స్ అవన్నీ.

విరించి టోకెన్ నెంబరు ఉదయం తొమ్మిదిన్నరకి వచ్చింది. ఓసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని వదిలి కన్సలేట్ ఆఫీసర్ దగ్గరకి నడిచాడు. ఆ లేడీ ఆఫీసర్ విరించిని పరీక్షగా చూసింది. తర్వాత తన దగ్గరున్న అతని పాస్‌పోర్టులోని ఫోటోతో పోల్చి చూసి తృప్తిపడింది.

"మీరు అమెరికాకి ఎందుకు వెళ్ళాలనుకుంటున్నారు?" అడిగింది.

"నేను పనిచేసే కంపెనీపనిమీద రా మెటీరియల్స్‌ని ఇంపోర్ట్ చేసుకునే పనిమీద."

"మీరు పనిచేసే కంపెనీ పేరు?"

"హీరాలాల్ కెమికల్స్ ప్రయివేట్ లిమిటెడ్ అందులో పర్చేజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను.

"ఇంతకాలం ఈ రా మెటీరియల్ ఎక్కడనించి కొనేవారు?"

"ఫ్రాన్స్‌నించి. అయితే క్వాంటమ్ ధర తక్కువ, క్వాలిటీ ఎక్కువ కనుక నెగోషియేషన్స్ అండ్ ఫైనలైజేషన్ ఆఫ్ పర్చేజ్ ఆర్డర్ కోసం వెళుతున్నాను."

"మిమ్మల్ని అమెరికా పంపడానికి కంపెనీ బోర్డు రిజల్యూషన్ పాస్ చేసిందా?"

తలూపి ఫైల్‌లోంచి మౌనంగా గోపీనాథ్ ప్రింట్ చేసి టై చేసి దొంగ సంతకాలు పెట్టిన ఆ రిజల్యూషన్ కాపీని అందించాడు. దాన్ని చదివాక అడిగిందామె.

"మీరు ఆ కంపెనీలో ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు?"

"ఎనిమిదేళ్ళుగా."

తన అపాయింట్ మెంట్ లెటర్ జిరాక్స్ కాపీని అందించాడు. కొత్తగా టైప్ చేసి తయారు చేసిన అది ఎనిమిదేళ్ళ క్రితం తయారుచేసిందిగా కనపడదు కాబట్టి జిరాక్స్ తెచ్చాడు.. అయితే ఆమె ఒరిజినల్ సర్టిఫికెట్ ఏదని అడగలేదు.

"మీ జీతం ఎంత?" ప్రశ్నించింది.

"పన్నెండువేల చిల్లర."

జెమ్‌క్లిప్ పెట్టిన పే స్లిప్స్ తీసి ఆమెకి అందించాడు.

"ఇంతకుందు ఎక్కడ పనిచేసేవారు?"

"ఎక్కడా లేదు. ఈ కంపెనీలో పర్చేజ్ క్లర్క్‌గా చేరి ఇక్కడే పర్చేజ్ ఆఫీసర్‌గా క్రితం ఏడాది ప్రమోట్ అయ్యాను."

"మీ కంపెనీ ప్రొడక్ట్స్ ఏమిటి?"

"వెటర్నరీ అండ్ హ్యూమన్ మెడిసిన్స్‌ని తయారు చేస్తాం. వెటర్నరీలో ఎనిమిది డ్రగ్స్, హ్యూమన్‌లో ఇరవైరెండు.."

గోపినాథ్ ముందే ఈ ప్రశ్నని ఊహించి అందుకు తగ్గ శిక్షణని విరించికి ఇప్పించబట్టీ అతను తడబడకుండా ఆ మందులపేర్లు, యితర వివరాలు టకటకా చెప్పాడు.

"యింకా ఇవే మందులని ఇండియాలో ఎన్ని కంపెనీలు తయారుచేస్తున్నాయి?"

"చాలా, కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఈ తరహా అమ్మకాల్లో మూడో స్థానంలో వున్నాయ్. నాలుగు, అయిదు స్థానాలు మాకన్నా పదిరెట్లు పెద్దవయిన కంపెనీలని చెప్పడానికి నాకు గర్వంగా వుంది" చిరునవ్వుతో చెప్పాడు విరించి.

"అమెరికాకి ఇదివరకెప్పుడైనా వెళ్ళారా?"

"లేదు."

"ఇతరదేశాలకి?"

"లేదు. ఈ బిజినెస్ పర్చేజ్‌కే పాస్‌పోర్ట్‌ని కొత్తగా అప్లయ్ చేసి తీసుకున్నాను."

"అమెరికాలో మీకు బంధువులున్నారా?"

"లేరు."

ఆమె కంప్యూటర్ బోర్డ్ ఆపరేట్ చేసి మానిటర్‌లో చూసి అడిగింది.

"పెళ్ళయిందా మీకు?"

"లేదు."

"మీకు ఆస్థిపాస్తులేమైనా వున్నాయా?"

"జీతంలోని సేవింగ్స్‌ని ఎఫ్.డి.లో వేశాను. మా నాన్నగారికి ఇల్లుంది. తదనంతరం నాకే వస్తుంది. నేనొక్కడినే కొడుకుని. ఎఫ్.డి సర్టిఫికెట్స్ తెచ్చాను."

అవి ఇస్తుంటే తీసుకోకుండా అడిగింది.

"ఆఖరి ప్రశ్న - జితేంద్ర ఎవరు?"

"మా కంపెనీ యం.డి."

"ఓ.కే, ఐ విష్ యూ ఎ ప్లెజెంట్ స్టే ఎట్ యు ఎస్ అండ్ సక్సెస్ఫుల్ బిజినెస్ ట్రాన్‌శాక్షన్."

"థాంక్యూ మేడమ్."

బయటికి వచ్చాక ఒక్కసారిగా ఊపిరి గట్టిగా తీసుకుని వదిలాడు విరించి.

ఇంత తేలికా?

అమెరికాకి తన వయసులోని వాళ్ళకి వీసారావడం ఎంతో కష్టం అని వినివుండటంతో వీసా రావడం యింత తేలికా అనిపించింది విరించికి. కానీ గోపినాథ్ తీసుకున్న పెద్ద, చిన్న జాగ్రత్తలవల్ల తనకి వీసా వచ్చిందని, ఆమె అడిగిన ప్రశ్నలకు జవాబుగా తెల్ల మొహం వేసినా తనకి వీసా వచ్చేది కాదని విరించికి స్పష్టంగా తెలీదు.

ఈ విషయం స్పష్టంగా తెలిసిన గోపినాథ్ నాలుగైదుసార్లు విరించిని తను కన్స్‌లేట్ ఆఫీసర్‌గా నటిస్తూ అనేక ప్రశ్నలు వేసి వాటికి కరెక్ట్‌గా జవాబెలా చెప్పాలో శిక్షణ యిచ్చాడు. అతను విరించిని ప్రిపేర్ చేసిన ప్రశ్నల్లో అధికశాతం ఆ ప్రశ్నలే వేసింది కన్స్‌లేట్ ఆఫీసర్.

బయటికి వచ్చాక విరించి హైదరాబాద్‌కి ఫోన్ చేసి చెప్పాడు. బి వన్ వీసా ముద్ర తన పాస్‌పోర్టులో పడ్డ సంగతి.

"వెరీగుడ్. నొటేషన్ ఏదయినా వుందా?" అడిగాడు గోపినాథ్ అవతలనుంచి.

"అంటే?"

"పాస్‌పోర్టు తెరచి చూడు. వీసా స్టిక్కర్ కింద చేత్తో ఏదైనా రాశారేమో?"

అది చూసిన విరించి చెప్పాడు.

"లేదు."

"సరే. ఒకసారి మనం ఏ బిజినెస్ పనిమీద వెళుతున్నామో ఆ అడ్రస్ దగ్గరున్న అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లో దిగాలని సూచిస్తారు అమెరికాలో. అక్కడ కాక ఇంకెక్కడ లేండయినా లోపలికి అనుమతించరు. బట్ - ఆ నొటేషన్ వున్నా నీ కిచ్చేది శాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్టు కాబట్టి ప్రాబ్లమ్ లేదు" చెప్పాడు గోపీనాథ్.

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**